


బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707



తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 107 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ మంగళవారం 26 -11-2024 వెల: 5/రూ -




## స్వావలంబన సాధించే దిశగా

# అడుగులు వేయాలి

**రాష్ట్ర పరిస్థితులు సౌర విద్యుత్‌కు అనుకూలంప్రతి ఇల్లూ, కార్యాలయంలో సౌర విద్యుదుత్పత్తి**

**ఇంటిపై విద్యుత్ ఉత్పత్తి వల్ల అదనపు ఆదాయంపూర్తి సోలారే వినియోగించేలా 132 గ్రామాలు**

**కుప్పంలో వంద శాతం సౌర విద్యుత్తు పథకం అమలు.. ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమీక్ష**

అమరావతి, నవంబరు 25 : రాష్ట్రం సౌర విద్యుదుత్పత్తి కేంద్రం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. సోలరైజేషన్ కార్యక్రమంపై అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో ప్రతి ఇల్లూ.. ప్రతీ కార్యాలయంలో సౌరశక్తిని ఒడిసిపట్టాలన్నారు. సోలార్ విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంలో స్వావలంభన సాధించే దిశగా అడుగులు వేయాలని పిలుపు ఇచ్చారు. సౌర విద్యుత్తును పూర్తిస్థాయిలో వినియోగించేందుకు అవసరమైన ప్రణాళికలను సత్వరం అమల్లోకి తేవాలన్నారు. సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం 132 గ్రామాలను సోలార్ విద్యు త్తు వినియోగ మోడల్ గ్రామాలుగా మారుస్తామని, ఈ గ్రామాల్లో వంద శాతం సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తూ వినియోగిస్తారని సీఎం చెప్పారు. రాష్ట్రంలో సోలరైజేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని అదికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల గృహాలకు సోలార్ విద్యుత్ సౌకర్యంపై సమీక్షించా రు. వారి ఇళ్లపై సోలార్ విద్యుత్తు పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. పూర్తి సోలరైజేషన్ కార్యక్రమంలో భాగంగా కుప్పంను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టడంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గంలో వంద శాతం సౌర విద్యుత్తు

మిగతా 2లో

## అదానీ నిధులు

# వద్దన్నాం

**మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**నేనేదో అప్పనంగా తీసుకున్నాననే చర్చ జరగడం ఇష్టం లేదు: సీఎం రేవంత్‌రెడ్డి**

**రూ.100 కోట్లు బదిలీ చేయొద్దని అదానీ సంస్థకు లేఖ రాశాం**

**నిధులు వద్దన్నంత మాత్రాన పాత ఒప్పందాల రద్దు సులువు కాదు**

**అసలు పెట్టుబడుల విషయంలో బీఆర్ఎస్ విధానమేంటి?**

**గతంలో వారు అదానీతో ఒప్పందాలు చేసుకున్నందుకు కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలా?.. వాళ్లది కడుపు మంట, కాకిగోల..**

**వాళ్లు అరుస్తుంటే మాకు ఉత్సాహం వస్తుంది**

**ఢిల్లీ వెళ్లేది బీఆర్ఎస్ వాళ్లలా పైరవీల కోసం కాదు..**

**రాష్ట్రానికి నిధుల కోసం వెళ్తున్నా.. మహారాష్ట్ర ఫలితాలపై కిషన్‌రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మండిపాటు**

హైదరాబాద్: రాష్ట్ర స్కిల్స్ యూనివర్సిటీ కోసం అదానీ సంస్థ ఇస్తామని ప్రకటించిన రూ. 100 కోట్లను తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అదానీ గ్రూపు విషయంలో వివాదాలు, జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అయితే పక్క రాష్ట్రాల్లో జరుగుతున్న వివాదాలకు, తెలంగాణ ప్రభుత్వానికి సంబంధం లేదని పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు జంగా రాఘవరెడ్డి, రోహిణ్‌రెడ్డి, సామా

మిగతా 2లో

## సీఎం ఎవరనేది తేల్చుకోలేకపోతున్న

# మహాయుతి పక్షాలు

**ఢిల్లీలో పార్టీ పెద్దలతో చర్చలు జరిపి ముంబైకి ఫడణవీస్**

**ఫడణవీస్-శిందే సీఎంలుగా చేరి రెండున్నరేళ్లని ప్రచారం**



**ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం 15వ అసెంబ్లీ ప్రారంభమైనట్లే**

**మహారాష్ట్రలో రాష్ట్రపతిపాలన ఉండకపోవచ్చు: నిపుణులు**

ముంబై, న్యూఢిల్లీ, నవంబరు25: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి స్పష్టమైన మెజారిటీ వచ్చినా, ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో బీజేపీ, శివసేన, ఎన్సీపీ నేతలు ఇంకా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఢిల్లీలో బీజేపీ పెద్దలతో సమావేశమై చర్చలు జరిపిన దేవేంద్ర ఫడణవీస్ తిరిగి ముంబైకి వెళ్లిపోయారు. శివసేన అధ్యక్షుడు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ కూడా ఢిల్లీలో బీజేపీ పెద్దలతో సమావేశంలో చర్చలు జరిపాకే తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే విషయంలో

మిగతా 2లో



**వన్యప్రాణుల సంరక్షణకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు**

మిగతా 2లో

# పీఠికకు బాసట

**సామ్య, లౌకిక వాదాల చేర్పు సరైనదే**

**అవతారికను సవరించే అధికారం**

**పార్లమెంటుకు ఉంది.. విచారణ అనవసరం**

**సామ్యవాదం అంటే సమానత్వం**

న్యూఢిల్లీ, నవంబరు 25: దేశంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్న తరుణంలో సుప్రీంకోర్టు సోమవారం 'పీఠిక'కు సంబంధించి కీలక తీర్పును వెలువరించింది. 1976లో జరిగిన 42వ రాజ్యాంగ

మిగతా 2లో

# అన్న.. అదానీ.. అల్లుడు.. తమ్ముడు!



ఆ నలుగురి కోసమే రేవంత్

వీళ్లపైనే రేవంత్ ధ్యాస.. వాళ్ల ప్రయోజనాల కోసమే పనులు

ముఖ్యమంత్రి పనిచేసేది పేద ప్రజల కోసం కాదు

మహాలక్ష్మి అన్నడు.. మహారాష్ట్రలో తన్నులు తిన్నడు

లగచర్లకు అధికారులు పోతే నిరసన తెలిపింద్రు

సీఎం రేవంత్‌రెడ్డి పోతే ఉరికించి కొట్టుడు ఖాయం

మిగతా 2లో

# తొలి రోజే 'అదానీ' రచ్చ

**లంచాల వ్యవహారంపై అట్టుడికిన సభలు**


**జేపీసీ, చర్చకు విపక్షాల పట్టు**

**లోక్‌సభ, రాజ్యసభలో వాయిదా తీర్మానాల**

**తిరస్కరణ.. సభలు రేపటికి వాయిదా**

**తొలి రోజే 'అదానీ' రచ్చ లంచాల వ్యవహారంపై జేపీసీ, చర్చకు విపక్షాల పట్టు..**

న్యూఢిల్లీ, నవంబరు: పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలిరోజే ఉభయసభల్లో గందరగోళం చెలరేగింది. అదానీ గ్రూపు అధినేత గౌతమ్ అదానీ తదితరులపై అమెరికా



### సీఎం ఎవరనేది తేల్చుకోలేకపోతున్న

# మహాయుతి పక్షాలు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. 288 స్థానాలకు గాను 132 చోట్ల గెలుపొందడంతో ఈసారి బీజేపీ సీఎం ఉండాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నాయి. ఫడణవీసనే సీఎం చేస్తారని, శిందే, అజిత్ పవార్‌లను డిప్యూటీ సీఎంలుగా చేస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఫడణవీస్ బ్రాహ్మణ వర్గానికి చెందిన నేత కావడంతో అధిష్టానం ఓబీసీ, లేదా దళిత నేపథ్యం ఉన్న నేత కోసం చూస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఎన్నికల్లో శివసేన 57 చోట్ల మాత్రమే నెగ్గినా తన నేతృత్వంలో కూటమి ఘన విజయం సాధించడంతో తనను సీఎంగా కొనసాగించాలని శిందే పట్టుబడుతున్నట్లు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటం, మరాఠా నేపథ్యం శిందేకు కలిసివచ్చే అవకాశం ఉంది. మరోవైపు ఈ ఎన్నికల్లో 41 చోట్ల గెలిచిన ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ప్రస్తుత తరుణంలో ఫడణవీసకు మద్దతీయాలని నిర్ణయించుకున్నారు. అయితే దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే చెరి రెండున్నరేళ్లు సీఎంగా కొనసాగే అవకాశముందనే ప్రచారం కూడా జరుగుతోంది. బీజేపీకి 21, శివసేనకు 12, ఎన్సీపీకి 10 మంత్రిత్వ శాఖలు ఇవ్వాలని నిర్ణయం జరిగినట్లు సమాచారం. మహారాష్ట్రలో ప్రస్తుత 14వ అసెంబ్లీకి నేటితో గడువు తీరిపోనుంది. దీంతో నేడు ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోతే రాష్ట్రపతి పాలన విధిస్తారని ప్రచారం జరిగింది. అయితే ఈ నెల 23న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రావడంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను ఎన్నికల సంఘం అధికారులు ఈ నెల 24న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు అందజేశారు. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం 73వ సెక్షన్ ప్రకారం 15 అసెంబ్లీ ప్రారంభమైనట్లేనని ఎన్నికల సంఘం అధికారులు చెబుతున్నారు. దీని ప్రకారం ఇక రాష్ట్రపతి పాలన ఉండకపోవచ్చని సమాచారం. ఢిల్లీలో జరుగుతున్న మంతనాలు కొలిక్కి వచ్చి, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మరో మూడు, నాలుగు రోజుల సమయం పట్టవచ్చని తెలుస్తోంది.

## వన్యప్రాణుల సంరక్షణకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

అమరావతి: ఏనుగులు పొలాల వైపు రాకుండా కందకాలు తవ్వే పనులు వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఇవాళ(సోమవారం) వెలగపూడి సచివాలయంలో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసి ఆ పథకం ద్వారా ఈ పనులను చేపట్టాలని సూచించారు. ఎలక్ట్రికల్ లైన్లను ఇన్సులేట్ చేసి తద్వారా వన్యప్రాణులకు ఏనుగులు ఎక్కువగా ఉండే మండలాల్లో విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదాన్ని నివారించేలా తక్షణం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటవీ అధికారులు రూపొందించిన సోలార్ కంచెలను వేలాడదీసే వినూత్న పరిష్కార మార్గాలను అమలు చేయాలని సూచించారు. ప్రజలను రక్షించడంతోపాటు వన్యప్రాణుల భద్రతను చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. వన్యప్రాణులను వేటాడటం, అటవీ సంపదను నాశనం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు ట్రోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వన్యప్రాణులను వేటాడటం... చంపడం... అక్రమ రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠినమైన శిక్షలు ఉంటాయని పవన్ కళ్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. అడవులను సంరక్షించడం, వన్యప్రాణులను కాపాడటం మనందరి బాధ్యత అని పవన్ కళ్యాణ్ గుర్తుచేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లు మనది వసుధైక కుటుంబమని ఉద్ఘాటించారు. భూమ్మీద మనతో పాటు మనుగడ సాధిస్తున్న జంతువులు, చెట్లు చేమలు, పశు పక్షాదుల పట్ల కరుణ చూపాలని పవన్ కళ్యాణ్ అన్నారు. వాటికి మనలాగే బతికే హక్కు ఉందని తెలిపారు. వన్య ప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం వన్య ప్రాణులను వేటాడటం, చంపడం, అక్రమ రవాణా చేయడం నిషేధమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బాధ్యతగా పనిచేస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేయాలి

పథకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. కుప్పంలో 50,314 ఇళ్లు సోలార్ విద్యుత్‌కు అనుకూలంగా ఉన్నాయని, 2,66,15,521 చదరపు అడుగుల విస్తీర్ణంలో సోలార్ రూఫ్ టాప్ విద్యుదుత్పత్తికి అవకాశం ఉందని వెల్లడించారు. కుప్పం రెస్కో ప్రాజెక్టుకు మొత్తం రూ.286 కోట్ల వ్యయం అవుతుందని, ఇందులో రూ.114 కోట్లను లబ్ధిదారులు రుణంగా పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపై సోలార్ పలకలు ఏర్పాటు చేసి వాటికి సౌర విద్యుత్తును అందిస్తామ ని చంద్రబాబు తెలిపారు. దీనివల్ల 100 మెగావాట్లకు సుమారుగా రూ.349 కోట్ల నుంచి రూ.379 కోట్ల మేర ఆదా అవుతుందన్నారు. లక్ష యూనిట్లకు పైగా విద్యుదుత్పత్తి లక్ష్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం 2,186 ప్రభుత్వ కార్యాలయాలను గుర్తించామన్నారు. 19,53,369 చదరపు మీటర్ల పరిధిలో సౌర విద్యుత్తు పలకలు ఏర్పాటు చేస్తే ఏడాదికి రూ. 262.25 కోట్ల వ్యయం అవుతుందని సీఎం చెప్పారు. ఎన్టీపీసీ విద్యుత్తు వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ దీన్ని చేపట్టనున్నదని, దీనికి ప్రభుత్వ గ్యారెంటీ ఇవ్వనుందని చెప్పారు. కాగా, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటులో పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వ్యవసాయ పంపుసెట్ల కోసం పీఎం కుసుమ్‌ను అమలు చేస్తామన్నారు.

**30 లక్షల ఇళ్లలో పీఎంఎస్జీఎంబీవై**

పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ యోజన పథకంలోకి కోటి గృహాలను తేవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లకు ఈ పథకాన్ని అమలు చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు రూ.50,000 ఖర్చు అవుతుండగా.. కేంద్రం రూ. 30,000 సబ్సిడీ ఇస్తోంది. అదే విధంగా 3 కిలోవాట్‌లకు పెట్టుబడి రూ.1.45 లక్షలకుగాను కేంద్రం రూ.78,000 సబ్సిడీ ఇస్తుంది. రాష్ట్రంలో ఈ పథకానికి సమ్మతి తెలుపుతూ ఇప్పటి వరకూ 6,33,045 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు రిజిస్టర్ చేసుకున్నారని అధికారులు తెలిపారు. వీరిలో పీఎం సూర్య ఘర్ పథకానికి 70,110 దరఖాస్తు చేసుకున్నారని, 4,961 గృహాలపై సోలార్ ప్యానల్స్ అమర్చడం పూర్తయిందని వివరించారు.

# అదానీ నిధులు వద్దన్నాం

(మొదటి పేజీ తరువాయి)

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు జంగా రాఘవరెడ్డి, రోహిణ్‌రెడ్డి, సామా రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సదుద్దేశంతో ప్రారంభించిన స్కిల్ వర్సిటీ వివాదాలకు లోనుకావడం తమకు ఇష్టం లేదని.. అనవసర వివాదాల్లోకి రాష్ట్ర ప్రభుత్వాన్ని, తమను లాగొద్దని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో చూడటం ద్వారా నిరుద్యోగులకు నష్టం చేసే వైఖరిని అవలంబించవద్దని విజ్ఞప్తి చేశారు. ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి కార్పస్ ఫండ్ కింద నిధులు ఇచ్చేందుకు చాలా సంస్థలు ముందుకొచ్చాయని సీఎం రేవంత్ చెప్పారు. అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.100 కోట్లు ఇచ్చేందుకు అదానీ సంస్థ ముందుకొచ్చిందని తెలిపారు. కానీ అదానీ సంస్థ అదేదో తెలంగాణ రాష్ట్రానికో, ముఖ్యమంత్రికో అప్పనంగా రూ.100 కోట్లు ఇచ్చినట్టు చర్చ జరుగుతోందన్నారు. "అదానీ సహా ఇప్పటివరకు ఏ సంస్థ నుంచి తెలంగాణ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అదానీ సంస్థ నుంచి నిధులు తీసుకున్నారంటూ వ్యక్తిగతంగా నా గురించి చర్చ జరగడం నాకు, కేబినెట్ సహచరులకు ఇష్టం లేదు. అందుకే మా అధికారి జయేశ్‌రంజన్ ద్వారా అదానీ సంస్థకు లేఖ రాశాం. ఆ సంస్థ ప్రకటించిన రూ.100 కోట్లు స్వీకరించడానికి సిద్ధంగా లేమని, ఆ నిధులు ప్రభుత్వానికి బదిలీ చేయవద్దని ఆ లేఖలో స్పష్టం చేశాం" అని రేవంత్ తెలిపారు. ఒప్పందాల రద్దు అంత సులువుకాదు అదానీ గ్రూపుతో గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటారా? అని మీడియా ప్రశ్నించగా.. అది అంత సులువైనది కాదని, అలా రద్దు చేసుకుంటే వారు కోర్టులకు వెళ్లే అవకాశం ఉంటుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. "అయినా అదానీ ఫ్లైట్‌లో ఆడంబరంగా తిరిగింది వాళ్లు. కేసీఆర్‌లా మేం అదానీ నుంచి అప్పనంగా తీసుకోలేదు. అదానీతో ఎన్నో ఒప్పందాలు చేసుకున్నవారు మాపై ఆరోపణలు చేస్తున్నారు. అసలు పెట్టుబడుల విషయంలో వారి విధానమేంటి? పెట్టుబడులు రాకపోతే తీసుకురాలేదంటారు. తెస్తే రద్దు చేసుకోవాలంటారు. అంటే గత ప్రభుత్వం అదానీ గ్రూపుతో జాతీయ రహదారులు, డేటా సెంటర్ల ఏర్పాటు కోసం ఒప్పందాలు చేసుకున్నందుకు కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలా? వారి మీద కూడా కేసులు పెట్టాలా?" అని రేవంత్ వ్యాఖ్యానించారు. ఎట్టుబడుల విషయంలో తాము ఎవరికీ ఆయాచిత లబ్ధి చేకూర్చబోమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. "2023లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. 2024లో డిపాజిట్లు కోల్పోయింది. ఇప్పుడు మెదడు కోల్పోయింది. మీ కడుపు మంట మాకు తెలుసు. మీ దుఃఖం మాకు తెలుసు. మీ కాకిగోలను పట్టించుకోం. మీలాంటి వాళ్లు అరుస్తుంటే మాకు ఉత్సాహం వస్తుంది. మా కార్యకర్తలు సంతోషపడతారు. మీ క్షోభను చూస్తుంటే అప్పుడప్పుడు కోపం వస్తుంది. అయినా ఏకాగ్రత, కార్యదీక్షతో మేం ముందుకెళుతున్నాం" అంటూ బీఆర్ఎస్ నేతలను ఎద్దేవా చేశారు. జార?ండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఉప ఎన్నికలపై రేవంత్‌రెడ్డి స్పందిస్తూ... ఆ ఎన్నికల వల్ల ఎవరికీ వచ్చింది లేదని, ఎవరికీ పోయింది లేదని పేర్కొన్నారు. "మహారాష్ట్రలో బీజేపీ కూటమికి ఎక్కువ సీట్లు వచ్చాయి. జార?ండ్‌లో ఇండియా కూటమికి ఎక్కువ సీట్లు వచ్చాయి. కర్ణాటక అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. బెంగాల్‌లో బీజేపీ డిపాజిట్లు కోల్పోయింది. దేశంలోని రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు మోదీని ఓడించి రాహుల్, ఖర్గేల నాయకత్వాన్ని బలపర్చారు. కేరళలోని వాయనాడ్ నుంచి ప్రియాంకా గాంధీ భారీ మెజార్టీతో గెలిచారు. మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ స్థానాన్ని మేమే గెలిచాం. దీన్నిబట్టి దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని, కిషన్‌రెడ్డిని ఛీ కొట్టారని అర్థమవుతోంది. అయినా కిషన్‌రెడ్డి ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. ఆయనను కేంద్ర మంత్రిగా చేయడం తెలంగాణ దురదృష్టం.." అని రేవంత్ విమర్శించారు. పైరవీల కోసం కాదు.. పెళ్లి కోసం ఢిల్లీ వెళ్తున్నా..

తాను ఢిల్లీ వెళ్లినప్పుడల్లా మంత్రివర్గ విస్తరణ గురించి వార్తలు వస్తున్నాయని సీఎం రేవంత్ అన్నారు. ఇప్పుడు తాను ఢిల్లీకి వెళ్తోంది లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహం కోసమని చెప్పారు. సోమవారం రాత్రి వివాహానికి హాజరై... మంగళవారం ఉదయం తెలంగాణ ఎంపీలతో సమావేశమవుతామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి పార్లమెంటు సమావేశాల్లో ప్రస్తావించే వ్యూహంపై చర్చిస్తామని చెప్పారు. అందుబాటులో కేంద్ర మంత్రులెవరైనా ఉంటే కలుస్తామన్నారు. అయితే తాము బీఆర్ఎస్ నేతల్లా పైరవీలు చేసేందుకు, కాళ్లు పట్టుకునేందుకు, కేసుల నుంచి తప్పించుకునేందుకో, మోదీ ముందు మోకరిల్లేందుకో ఢిల్లీకి వెళ్లడం లేదని పేర్కొన్నారు. కేంద్రాన్ని నిలదీసి అయినా నిధులు తెచ్చుకునేందుకు వెళుతున్నామని.. ఎన్నిసార్లయినా వెళ్తామని రేవంత్ చెప్పారు. కేంద్రం సమాఖ్య స్ఫూర్తితో ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు ఇవ్వాలని ఇవ్వాలని... అదేమీ బీజేపీ ఖజానా కాదని వ్యాఖ్యానించారు. ఏ ఎన్నికలైనా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలనేది కాంగ్రెస్ పార్టీ విధానమని, తనది కూడా అదే అభిప్రాయమని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

## అన్న.. అదానీ.. అల్లుడు.. తమ్ముడు!

వరంగల్, నవంబర్ 25 : పేదలు, రైతుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేయడంలేదని.. సొంత అన్న, అదానీ, సొంత అల్లుడు, సొంత తమ్ముడి కోసమే పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఫార్మా విలేజీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి సొంత అల్లుడి ఫార్మా దుకాణం కోసం పేద రైతుల భూములను గుంజుకుంటున్నాడని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో కూర్చొని మరో పది రోజులైతే ఏడాదవుతుందని, అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. గ్యారెంటీల అమలులో విఫలమైనందుకు రాష్ట్ర ప్రజలకు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంటు వచ్చేదని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత రైతు బంధు ఎగ్గొటిండని, రైతు బీమా బంధు పెట్టిండని, వడ్లకు బోనస్ బోగస్ అయ్యిందని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం పేరు చెప్పి రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో తన్నులు తిన్నాడని ఎద్దేవాచేశారు. తెలంగాణలో ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఇస్తున్నామని మహారాష్ట్రలో అబద్ధం చెప్పినందుకు అక్కడి ఆడబిడ్డలు గట్టిగా బుద్ధి చెప్పారని దెప్పిపొడిచారు. 'తెలంగాణ ఆడబిడ్డలను మోసం చేసిండు.. మమ్మల్ని కూడా మోసం చేయడానికే వచ్చిండు అని మహారాష్ట్ర ఆడబిడ్డలు ముందే గమనించిండ్రు.. అందుకే చైతన్యంతో కాంగ్రెస్‌ను తన్ని తరిమికొట్టిండ్రు' అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోకవర్గం కొడంగల్‌లోని లగచర్ల గిరిజన, దళిత, పేద రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండకు నిరసనగా మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన గిరిజన మహాధర్నాలో కేటీఆర్ ప్రసంగించారు. '14 ఏండ్ల కిందట ఇదే మానుకోట ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ఒక పెద్ద మలుపునకు కారణమైంది. మానుకోట రాళ్ల మహత్యమేమిటో తెలంగాణను అడ్డుకున్న ప్రతి ఒక్కడికీ తెలుసు' అని హెచ్చరించారు. 'ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములను గుంజుకుంటం.. ఏం చేసుకుంటారో చేసుకోండి అని నియంతలా విర్రవీగుతున్న రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మానుకోట మహాధర్నాకు పెద్దఎత్తున గిరిజనులు, పేద రైతులు తరలివచ్చిండ్రు' అని చెప్పారు. 'రేవంత్ సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని దుద్యాల మండలం లగచర్లలో తొమ్మిది నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములను గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నరు.. అందుకే అక్కడి రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తిరగబడ్డరు. పేద, చిన్న, సన్నకారు రైతులకు చెందిన మూడు వేల ఎకరాల భూములను ఫార్మా విలేజీ కోసం తీసుకుంటామని సీఎం, కాంగ్రెస్ ప్రభుత్వం కాగితాల మీద కాగితాలు కదుపుతుంటే అక్కడ ఉండే మన లంబాడా గిరిజనులు, బంజారా ఆడబిడ్డలు తిరుగుబాటు చేసింద్రు. భూముల కోసం అక్కడి రైతులు 9 నెలలుగా టెంట్ వేసుకుని ధర్నా చేస్తున్నరు' అని వివరించారు. వారితో మాట్లాడేందుకు ముఖ్యమంత్రికి 9 నెలలుగా సమయం దొరకడం లేదని విమర్శించారు. మానుకోటలో ధర్నా కోసం డీజీపీకి ఫోన్ చేస్తే 30 మంది రైతుల కోసం సంఘీభావంగా మానుకోటలో ధర్నా ఎందుకు అన్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ పేదలు, దళిత, గిరిజన, బలహీన అన్నదమ్ములున్నారో వారందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

## తొలి రోజే 'అదానీ' రచ్చ

కోర్టులో లంచాల అభియోగాలు నమోదైన వ్యవహారంపై చర్చ కోసం, పార్లమెంటరీ సంయుక్త బృందం (జేపీసీ) ఏర్పాటుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సభ్యులు పట్టుబట్టారు. ఇందుకు అధికారపక్షం నిరాకరించడంతో వారు ఆందోళనకు దిగారు. ఉదయం రాజ్యసభ ప్రారంభం కాగానే.. అదానీ ముడుపుల అంశంపై చర్చకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. వీటిని చైర్మన్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ఖర్గేకు మాట్లాడే అవకాశమిచ్చారు. సభ ఎజెండాను సస్పెండ్ చేసి చర్చ చేపట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు. అదానీ నిర్వాకంతో ప్రపంచవ్యాప్తంగా దేశ ప్రతిష్ఠ మసకబారిందని.. అయినా ప్రధాని మోదీ ఆయనకు మద్దతిస్తున్నారని విమర్శించారు. ఇదే సమయంలో ఈ అం?శంపై కూలంకషంగా చర్చించాలని ఇతర విపక్ష ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. చైర్మన్ చివరకు సభను బుధవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో కూడా అదే గందరగోళం తలెత్తింది. సభ మొదలుకాగానే.. చనిపోయిన సభ్యులకు సంతాపం తెలుపుతూ స్పీకర్ ఓం బిర్లా తీర్మానం చదివారు. వెంటనే కాంగ్రెస్ ఎంపీలు వేణుగోపాల్, హిబీ ఈడెన్, మనీశ్ తివారీ, మాణిక్కం ఠాగూర్ అదానీ లంచాలపై చర్చించాలని, ఈ అంశంపై జేపీసీని వేయాలని డిమాండ్ చేస్తూ ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చించాలని కోరారు. సభాపతి అంగీకరించకపోవడంతో నినాదాలు చేశారు. దీంతో ఆయన సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు జేపీసీకి పట్టుబట్టడంతో బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

## పీఠికకు బాసట

(మొదటి పేజీ తరువాయి)

సవరణ ద్వారా చేర్చిన అంశాలకు ఆమోదం తెలిపింది. రాజ్యాంగం అవతారికలో 'సామ్యవాదం', 'లౌకికవాదం', 'సమగ్రత' అన్న పదాలను చేర్చడాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. ఈ అంశంపై విచారణ జరపాల్సిన పనిలేదని విస్పష్టంగా తెలిపింది. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, అత్యయిక పరిస్థితి అమల్లో ఉన్న సమయంలో రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో ఈ పదాలను అదనంగా చేర్చారు. దీన్ని సవాలు చేస్తూ తొలిసారిగా 2020లో బలరాం సింగ్ అనే వ్యక్తి న్యాయవాది విష్ణు కుమార్ జైన్ ద్వారా పిటిషన్ వేశారు. అనంతరం రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, న్యాయవాది, బీజేపీ నాయకుడు అశ్విన్ కుమార్ ఉపాధ్యాయలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్‌ల ధర్మాసనం శుక్రవారం తీర్పును వాయిదా వేసింది. సోమవారం సీజేఐ జస్టిస్ ఖన్నా తీర్పును వెలువరిస్తూ "ఈ విషయమై మరింత లోతుగా విచారణలు, తీర్పులు అవసరం లేదు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారం పీఠికకు కూడా వర్తిస్తుంది" అంటూ స్పష్టత ఇచ్చారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీ సవరణలు చేసేందుకు అడ్డంకి కాబోదని ధర్మాసనం తెలిపింది. ఆ తేదీ సవరణలు చేసేందుకు పార్లమెంటుకు ఉన్న అధికారాలను తగ్గించలేదని పేర్కొంది. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని తెలిపింది. రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న ఆమోదించగా అనంతరం ఎప్పుడో 1976లో పీఠికను సవరించి 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాలను ఎలా చేర్చుతారంటూ సుబ్రహ్మణ్య స్వామి ప్రశ్నించారు. అలా చేర్చడం ద్వారా మొదటి నుంచే ఈ భావనలు అమల్లో ఉన్నట్టైందని అభ్యంతరం చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పష్టతనిస్తూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తేదీ సవరణలకు అడ్డంకి కాబోదని తెలిపింది. "రాజ్యాంగ సవరణకు 368 అధికరణం ద్వారా పార్లమెంటుకు సంక్రమించిన అధికారం నిర్వివాదమైనది. ఆ అధికారాన్ని ఇప్పుడు సవాలు చేయలేదు" అని పేర్కొంది.

**సమానత్వ భావనకు మరో రూపం**

పిటిషనర్లు ప్రధానంగా అభ్యంతరం తెలిపిన 'సామ్యవాదం', 'లౌకికవాదం' అన్న పదాల చేర్పుపై ధర్మాసనం వివరణ ఇచ్చింది. ఇది రాజ్యాంగం మౌలిక సూత్రమైన 'సమానత్వం' అన్న భావనను మరో రూపంలో చెప్పడమేనని స్పష్టం చేసింది. పీఠికలో 'లౌకిక వాదం' అన్న పదాన్ని ఎందుకు చేర్చాల్సి వచ్చిందన్న దానిపై జస్టిస్ ఖన్నా వివరణ ఇస్తూ.. "సమానత్వానికి, ప్రజా ప్రయోజనానికి అడ్డంకులు కలిగించేలా మత విశ్వాసాలు ఉంటే అందులో రాజ్యం జోక్యం చేసుకుంటుంది. ఈ స్పష్టత కోసమే పీఠికలో 'సెక్యులర్' అన్న పదాన్ని పొందుపరిచారు" అని వివరించారు. లౌకికవాద భావనను దేశ పరిస్థితులకు అనుగుణంగానే అర్థం చేసుకోవాలన్నారు. 'సామ్యవాదం' అన్న భావనకు కూడా భారత దేశ నేపథ్యంలోనే భాష్యం చెప్పాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక విధానాలకు అడ్డంకి అని భావించకూడదని తెలిపింది. "రాజ్యాంగంగానీ, పీఠికగానీ ఏదో ప్రత్యేక ఆర్థిక విధానాన్ని అనుసరించాలని ఎక్కడా చెప్పలేదు. 'సామ్యవాదం' అంటే 'సంక్షేమ రాజ్యా'నికి కట్టుబడి ఉండడం. సమాన అవకాశాలకు భరోసా ఇవ్వడం. నే హక్కును నియంత్రించేది మాత్రం కాదు" అని వివరణ ఇచ్చింది. అయినా 42వ రాజ్యాంగ సవరణ జరిగి 44 ఏళ్లు గడవగా (పిటిషన్ దాఖలు చేసిన 2020నాటికి) ఇప్పుడు ఈ సమస్యను ఎందుకు లేవనెత్తారంటూ పిటిషనర్ల ఉద్దేశాలను ప్రశ్నించింది. "ఈ రెండు పదాలను చేర్చడం వల్ల ఎన్నికైన ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకుగానీ, చట్టాలకుగానీ ఆటంకం కలగలేదు. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ హక్కులు, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగించలేదు.

# కలెక్టరేట్ మొదటి అంతస్తు లోని సిపిఓ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

సిపివో కార్యాలయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు.

షార్ట్ సర్క్యూట్ పై విచారణకు ట్రాన్సుకో,అగ్నిమాపక శాఖలను ఆదేశించిన కలెక్టర్.

కలెక్టరేట్ లోని అన్ని శాఖల కార్యాలయాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలను తనిఖీ చేయాలని ఆదేశం



**సంగారెడ్డి అర్బన్ , నవంబర్ 25 (డైలీ రిపోర్ట్ ):** సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో ఉన్న సిపిఓ కార్యాలయంలో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ జరిగింది. ఘటనకు సంబందించిన వివరాలు సంబంధిత శాఖ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చెప్పిన వివరాల ప్రకారం, షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు వివరించారు. పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ట్రాన్సుకో,అగ్నిమాపక శాఖ లను ఆదేశించారు.ఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సేకరించి, షార్ట్ సర్క్యూట్ వెనుక ఉన్న కారణాలను ఖచ్చితంగా నిర్ధారించాలని ట్రాన్స్కో, అగ్నిమాపక శాఖ కు సూచించారు. కలెక్టరేట్ లోని అన్ని కార్యాలయాల భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల కార్యాలయాల్లో ఉన్న ఫైర్ సేఫ్టీ పరికరాలు సరిగా పనిచేస్తున్నాయా లేదా అనేది పరిశీలించాలని ఇలాంటి సంఘటనలు కలెక్టరేట్లో పునరావృతం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.








## యోగ కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్ వెంకటేశ్వరరావు


**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 25 ( డైలీ రిపోర్ట్ ):** ఆయుష్ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, ప్రభుత్వ యునని వైద్యశాలలకు ఒక మగ ఒక ఆడ యోగ భోధకులని నియమించారు. అందులో భాగంగా భద్రాచలం యోగ కేంద్రానికి రమాదేవి, లక్ష్మి కుమారి, సునీత, మనోజ్ కుమార్ నియామకమయ్యారు. ఈ యోగ కేంద్రాన్ని జిల్లా ఇంచార్జ్ డా. బి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ వల్ల మానసిక, శారీరక రూగ్మతల నుండి ఉపశమనం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్మింగ్ మేనేజర్ డా. మహేష్ గౌడ్, ఫార్మసిస్ట్ జి. వీరయ్య, రత్నవళి, ఎం ఎన్ ఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలో అక్రమ మైనింగ్ ను అరికట్టాలి

కేంద్రబొగ్గుగనుల శాఖా మంత్రి కిషన్ రెడ్డి గారికి వినతిపత్రం అందజేసిన నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్


పటాన్ చెరువు డైలీ రిపోర్ట్ నవంబర్25: పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని లక్డారం రాళ్ళకత్వ మాధారం గ్రామాలు అక్రమ మైనింగ్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పర్యావరణానికి తీవ్ర ముప్పు కలుగుతుందని నవభారత్ నిర్మాన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి గంగాపురం కిషన్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. ఆ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఆ గ్రామలను కాపాడాలని మెట్టుశ్రీధర్ కోరారు.





## శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు డైలీ రిపోర్ట్:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ సిద్ధార్థ ఎంక్లేవ్ కాలనీలో శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. హాజరైన మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, తదితరులు.





## ఆత్మీయ సమ్మేళనము చిరస్మరణీయం

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

**రామచంద్రపురం: నవంబర్ 25 ( డైలీ రిపోర్ట్ ):** 1998-1999 రామచంద్రాపురం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది, పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు ఉపాధ్యాయులను ఉద్దేశించి విద్యార్థులు మాట్లాడారు వారు నేర్పిన విద్యాబుద్ధులే నేడు ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లిందని జీవితానికి స్థిరత్వాన్ని కల్పించిందని కొనియాడారు అనంతరం శాలువా పూలమాలలతో ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు చేయడం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పై ఉన్నటువంటి గౌరవ మర్యాదలను ప్రతిబింబిస్తుందని భవిష్యత్ తరాలకు కూడా ఇది ఒక మంచి సందేశం అని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో ఆనందంగా ఉందని ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం అభినందనీయమని పూర్వ విద్యార్థులను ప్రశంసించారు. భోజనం అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో మహిళలు చురుకుగా పాల్గొన్నారు వివిధ ఆటలలో గెలిచిన వాళ్లకు ప్రథమ ద్వితీయ బహుమతులను ప్రధానం చేశారు. 25 సంవత్సరాల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్న విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కార్యక్రమంలోప్రధానోపాధ్యాయురాలు ఉషాకులకర్ణి ఉపాధ్యాయులు నాగభూషణం, అమీరుద్దీన్,ఇందిరా భాస్కర్, శివారెడ్డి, సంధ్యారాణి, హెలినా, కిష్టయ్య,బసవేశ్వర్, లక్ష్మణ్,రవీందర్, కవిత పాల్గొన్నారు.

## ప్రజావాణికి 60 ఫిర్యాదులు

**సంగారెడ్డి బ్యూరో నవంబర్ 25(డైలీ రిపోర్ట్):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 60 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డి ఆర్ ఓ పద్మజరాణి, సంగారెడ్డి ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమేపరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మెన్ మెట్టు సాయికుమార్ గంగపుత్రను మర్యాద పూర్వకంగా కలసిన తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ఖన్నాజి




**హైదరాబాద్ నవంబర్ 25(డైలీ రిపోర్ట్):** హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట మత్య శాఖ కమిషనర్ కార్యాలయంలో 2024 సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో ఉత్తమ అంతర్గత మత్యకారుల జాతీయ అవార్డు తెలంగాణ మత్య శాఖకు దక్కిన సందర్భంగా తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ ఛైర్మెన్ మెట్టు సాయికుమార్ గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపిన అనంతరము తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన దక్షతకు నిదర్శనంగా ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ గంగపుత్ర నేతృత్వములో జాతీయ స్థాయిలో అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సాంప్రదాయ మత్యకార గంగపుత్రులకు మత్య శాఖ అధికారులకు ఉద్యోగులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.





## చేవెళ్ళ నియోజక వర్గం లో పలు కార్యక్రమాలలో పాల్గొన్న

# చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జి భీమ్ భరత్

**శంకర్పల్లి నవంబర్ 25 :(డైలీ రిపోర్ట్):** లి చేవెళ్ళ మండలం దామరగిద్ద గేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఎం.కె. ఫ్యామిలీ రెస్టారెంట్ శంకర్ పల్లి మండలం పిల్లిగుండ్ల కాంతి రెడ్డి గారి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం మొయినాబాద్ మండలం కనక మామిడి గేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కార్జ్ &స్ప డిటైలింగ్ స్టూడియో షాప్ లకి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జీ పామేనా భీమ్ భరత్.మరియు వీరితో పాటుగా పాల్గొన్న చేవెళ్ళ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట రెడ్డి , యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ , చేవెళ్ళ మండల యూత్ కాంగ్రెస్ మద్దెల శ్రీనివాస్ , శంకర్ పల్లీ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి , సీనియర్ నాయకులు , యూత్ కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అనిత రెడ్డి

**శంకర్‌పల్లి నవంబర్ 25:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అనిత రెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మాజీ చైర్మన్ కు ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. మాజీ చైర్మన్ తో పాటు మాజీ జెడ్పిటిసి గోవిందమ్మ, ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, గౌరవాధ్యక్షులు సదానందం గౌడ్, వైస్ చైర్మన్ శేఖర్, కమిటీ సభ్యులు దేవేందర్ రెడ్డి ఉన్నారు.



## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఘనంగా శివపార్వతుల ఊరేగింపు

**శంకర్పల్లి నవంబర్ 25:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో కార్తీక మాస చివరి సోమవారం రాత్రి శివపార్వతులను బ్రహ్మరథంలో ఊరేగించారు. ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ రాజు, ప్రధాన అర్చకులు సాయిశివ, పూజారి ప్రమోద్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈనెల29న జరిగే దీక్షా దివస్ ను విజయవంతం చేయాలి

**టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్రి వెంకటయ్య , పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి పిలుపు.**

**యాదగిరిగుట్ట నవంబర్ 25:**ఈనెల 29వ తేదీన జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే దీక్షా దివస్ ను విజయవంతం చేయాలని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్ర వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2009 నవంబర్ 29న రాష్ట్ర సాధనకు దీక్షను చేశారన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం దేశానికే ఒక రోల్ మోడల్ గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ఘనత కేసిఆర్ కి దక్కిందన్నారు. ఒకప్పుడు ఉన్న పరిస్థితులు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారం రాగానే నిర్బంధాలు మొదలయాయన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమం నిరసిస్తూ 29 బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్షా దీవస్ ను విజయవంతం చేసి ప్రభుత్వానికి కనువిప్పు కల్పించాలన్నారు.

## గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల తనిఖీ చేసిన

# రెవిన్యూ అదనపు కలెక్టర్ మాధురి

### సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ సస్పెన్షన్

### కలెక్టర్ క్రాంతి వల్లూరు కి నివేదిక అందజేసిన అదనపు కలెక్టర్( రెవిన్యూ)

**సంగారెడ్డి బ్యూరో నవంబర్ 25(డైలీ రిపోర్ట్):** కొండాపూర్ మండలం ,గిర్మాపూర్ లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే.గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమస్యల పై జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమస్యలపై విచారణ జరపాలని అదనపు కలెక్టర్ మాధురి ని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ మాధురి సోమవారం ఉదయం గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పలు సమస్యలను అదనపు కలెక్టర్ గుర్తించారు. పాఠశాల సమస్యలపై ప్రిన్సిపల్ పనితీరుపై పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్ వల్లూరు క్రాంతికి అదనపు కలెక్టర్ అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించడం లేదని, పారిశుధ్య లోపం , పాఠశాల సమస్యలు పరిష్కరించడంలో ప్రిన్సిపల్ నిర్లక్ష్య వైఖరి గుర్తించినట్లు తెలిసింది. అదనపు కలెక్టర్ నివేదిక ఆధారంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు గిర్మాపూర్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ ను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తిస్థాయి విచారణ పూర్తయ్యే వరకు ప్రిన్సిపల్ హెడ్ క్వార్టర్ లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పునరావృతం కాకుండా సంక్షేమ వసతి గృహాల వార్డెన్ లు ,సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్ లు అవసరమైన ముందు జాగ్రత్తగా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఎక్స్పైరీ డేట్ అయిపోయిన సరుకులు వాడొద్దని విద్యార్థులు ఆరోగ్యం పై అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు .బియ్యంలో తెల్ల పురుగులు వస్తే ఆ బియ్యాన్ని వెనక్కు పంపాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఇద్దరికీ ఐదేళ్లు జైలు శిక్ష..

**25000 వేల చొప్పున జరిమానా**

**సంగారెడ్డి బ్యూరో నవంబర్ 25:** సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి ఓపియం డ్రగ్స్ కేసులో ఇద్దరికీ ఐదేళ్ల జైలు శిక్ష రూ. 25000 వేల చొప్పున జరిమానాను సోమవారం విధిస్తూ తీర్పు వెల్లడించారు.వివరాల్లోకి వెళితే.. 2016 సంవత్సరములో పటాన్చెరువు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఓపియం అమ్మకాలు జరుపు ఇద్దరూ పట్టుబడ్డారు. పఠాన్ చెరువుకు చెందిన గొల్ల రమణ, రవీందర్ యాదవ్ లపై సీఐ రఘునాథరెడ్డి కేసు నమోదు చేశారు. 2016లో నమోదైన ఈ కేసులో సోమవారం సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి ఇద్దరికీ ఐదేళ్లు జైలు శిక్ష రూపాయలు 25 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. ఐదేళ్ల జైలు శిక్ష విధించడంతో కోర్టు కానిస్టేబుల్ నందు సింగ్ ఇద్దరినీ జైలుకు తరలించారు. డ్రగ్స్ కేసులో నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు చేపట్టినటువంటి ఎక్సైజ్ సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలా సన్ రెడ్డి,సంగారెడ్డి మెదక్ డిప్యూటీ కమిషనర్ హరి కిషన్ అభినందించారు.





## కలెక్టరేట్‌లో కార్తీక వనభోజనాలు

**ముఖ్య అతిధులుగా హాజరైన కలెక్టర్ ,అదనపు కలెక్టర్**

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 25(డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి కలెక్టర్ లోని ఫ్రీడమ్ పార్కులో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. డిఆర్డిఏ పిడి జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజనాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్ లు ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులతో కలిసి కార్తీక వనభోజనాలలో కలెక్టర్, అదనపు కలెక్టర్ పాల్గొని భోజనం చేశారు. ఉద్యోగులలో స్నేహభావం పెంపొందడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్లోని వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707